ప్రాణాలు తీస్తున్న అతివేగం

- వేగ నిరోధకాలు పెట్టినా ఆగని ప్రమాదాలు
- 167 జాతీయ రహదారిపై పెరుగుతున్న ప్రమాదాలు
- 8 నెలల్లో ప్రమాదాల్లో 21 మంది మృతి, 82 మందికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: రోడ్డు ప్రమాదం అంటే బైకో.. కారో పడిపోవడం కాదు..ఒక కుటుంబం రోడ్డున పడటం అనేది అక్షర సత్యం. కొన్ని ప్రమాదాలు అనుకోకుండా జరుగుతున్నాయి. మరి కొన్ని మానవ తప్పిదాల వల్ల జరుగుతుంటాయి. రోజు వాహనాలు తనిఖీలు చేస్తున్నా, అతి వేగం, మద్యం సేవించి వాహనాలను నడుపుతుండటంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. 167వ నంబర్ జాతీయర రహదారితో పాటు ఎర్రకోట–రాళ్లదొడ్డి నల్లవంక, రాళ్లదొడ్డి, కోటేకల్, బనవాసి నవోదయ ప్రాంతాల మలుపుల దగ్గర ఎలాంటి ప్రమాద నిరోధకాలు లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నియోజకవర్గంలో 2023 జనవరి నుంచి ఆగస్టు వరకు జరిగిన ప్రమాదాల్లో 21 మంది మృతి చెందగా, 82 మందికి గాయాలయ్యాయి. మలుపుల వద్ద ప్రమాదాలు నివారించేందుకు రోడ్డుకు అడ్డంగా బోర్డులు ఏర్పాటు చేసినా ప్రమాదాలు తగ్గడం లేదు.

ఈ ఏడాది జరిగిన కొన్ని రోడ్డు ప్రమాదాలు

- జనవరి 1న జాతీయ రహదారి నలందా బీఈడీ కాలేజీ వద్ద ఆర్టీసీ బస్సు స్కూటర్ ఢీకొట్టుకోవడంతో ఆర్ఎంపీ డాక్టర్ చాంద్‌బాషా మృతి, ఒకరికి గాయాలయ్యాయి.
- 2న ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డి వద్ద స్కూటర్ ప్రమాదంలో కె.ప్రతాప్ అనే యువకుడు మృతి చెందాడు.
- 31న ఆదోని–దేవబెట్ట బస్సు క్రాస్ దగ్గర రెండు స్కూటర్లు ఢీకొని దంపతులకు గాయాలయ్యాయి.
- ఫిబ్రవరి 10వ తేదీన పట్టణంలోని అన్నమయ్య సర్కిల్లో రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు మార్చి 9న కోటేకల్ మలుపు వద్ద ఆటో ప్రమాదంలో కురువ శివనాగుడు మృతి, ఒకరికి గాయాలు
- 11న జాతీయ రహదారి అగ్నిమాపక కేంద్రం వద్ద ఆటో, కారు ఢీకొని ఇద్దరికి గాయాలు
- 14న రాళ్లదొడ్డి వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డ ఆటో డ్రైవర్ శివ, అదే రోజు సిరాలదొడ్డి సబ్‌స్టేషన్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొనటంతో స్కూటరిస్టు కిష్టప్పకు గాయాలు
- ఏప్రిల్ 9న గుడేకల్ గ్రామం శ్రీరామ్ నగర్ సమీపంలో ట్రాక్టర్ ఢీకొనడంతో ఒకరికి గాయాలు
- మే 15న జాతీయ రహదారి బోడబండ–చెన్నాపురం గ్రామాల మధ్య బైక్ ప్రమాదంలో మేరి మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి.
- 25న రాళ్లదొడ్డి గ్రామం దగ్గర బొలెరో–కారు ఢీకొనటంతో ప్రార్థన అనే మహిళ మృతి చెందగా ఐదుగురికి గాయాలయ్యాయి.
- 25న జాతీయ రహదారి ఎస్ఎంఎల్ డిగ్రీ కాలేజీ వద్ద కారు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు
- 28న కర్నూలు రోడ్డులో ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ ఒకరికి గాయాలు
- 29న ఎర్రకోట వద్ద లారీ టైర్ పేలి బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలు.
- 31వ తేదీన కలుగోట్ల రోడ్డులో రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు
- జూన్ 4న పట్టణంలోని జాతీయ రహదారి రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద రెండు బైకులు ఢీ ఇద్దరికి గాయాలు
- 11న సిరాలదొడ్డి సబ్ స్టేషన్ వద్ద బైక్ ప్రమాదంలో ఒకరికి గాయాలు
- 12న ఎర్రకోట సబ్ స్టేషన్ సమీపంలో ఆటో–కారు ఢీకొని 9 మందికి గాయాలు.
- 13న ఎర్రకోట గ్రామ సమీపంలో కారు బోల్తా ఇద్దరికి గాయాలు. అదే రోజు పట్టణంలోని ఎద్ల మార్కెట్ వద్ద ఆర్టీసీ బస్సు–స్కూటర్ ఢీకొని ఒకరికి గాయాలు.
- జూలై 28న కర్నూల్ రోడ్డు షాదీఖానా వద్ద ఆర్టీసీ బస్సు, స్కూటర్ ఢీకొని ఇంజినీరింగ్ విద్యార్థి లింగారెడ్డి మృతి, మరొకరికి గాయాలు.
- 29న ఆదోని రోడ్డు వెంకటాపురం క్రాస్ సమీపంలో ట్రాక్టర్, బైక్ ఢీకొని నారాయణ అనే యువకుడికి తీవ్ర గాయాలు
- ఆగస్టు 14న ఆదోని రోడ్డు అగ్ని మాపక కేంద్రం సమీపంలో రెండు బైకులు ఢీకొని వడ్డె నరసింహులు మృతి, మరో ఇద్దరికి గాయాలు


ఆదోని రోడ్డులో జరిగిన ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం



ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. హైవే రోడ్డు కావడంతో వేగ నిరోధకాలు లేవు. వాహనదారులు అతివేగంగా వస్తూ నియంత్రణ కోల్పోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. కోటేకల్, రాళ్లదొడ్డి గ్రామాల మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు సూచనలతో పాటు నిదానంగా వెళ్లాలని సూచికలు ఏర్పాటు చేశాం. గ్రామాలకు వెళ్లినప్పుడు శాంతిభద్రలతో పాటు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టకోవాలి. వాహనదారులు సహకరిస్తే కొంత వరకు ప్రమాదాలు నివారించవచ్చు. – **మోహన్‌రెడ్డి, రూరల్ సీఐ, ఎమ్మిగనూరు**


కర్నూలు రోడ్డులో బైక్‌ను ఢీకొన్న బస్సు


రాళ్లదొడ్డి వద్ద బొలెరో–కారు ఢీకొనడంతో గాయపడిన వ్యక్తులు

సెప్టెంబర్ 3న జాతీయ రహదారి మంత్రాలయం రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో కారు బైక్‌ను ఢీకొనటంతో మాజీ సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ డీఎండీ మహమ్మద్ బాషా మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి.

- నందవరం మండలంలో జనవరి నుంచి ఇప్పటి వరకు 6 ప్రమాదాల్లో ముగ్గురు చనిపోగా ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి.
- గోనెగండ్ల మండలంలో జనవరి నుంచి ఆగస్టు వరకు జరిగిన ప్రమాదాల్లో నలుగురు మృతి చెందగా ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

క్లుప్తంగా

ఎడ్లకు దోమ తెర


పెద్దహ్యాటలో ఎడ్లకు దోమతెర ఏర్పాటు చేసిన దృశ్యం

ఆలూరు: హొళగుంద మండలంలోని పెద్ద హ్యాట గ్రామానికి రైతు తిమ్మయ్య తన కాడెద్దులు దోమకాటుకు గురికాకుండా దోమతెరలను ఏర్పాటు చేశారు. వ్యవసాయ సీజన్‌లో ఎద్దులతో అవసరం ఎక్కువగా ఉంటుందని, ఎడ్లు దోమకాటుతో వ్యాధుల బారిన పడకుండా సంరక్షించుకుంటున్నట్లు చెప్పారు. ఎడ్ల కోసం ప్రత్యేకంగా దోమ తెరలను కుట్టించామని, ఇందుకు రూ.1500 వరకు ఖర్చయినట్లు తెలిపారు. వ్యవసాయంలో ఆధారంగా ఉన్న ఎడ్లను తమ కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

మొక్కలను మూలన పడేశారు


మద్దికెరలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఉన్న మొక్కలు

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనం పెంపొందించేందుకు ఇళ్ల వద్ద, పాఠశాలల్లో, పొలాలలో నాటేందుకు వంద శాతం సబ్సిడీతో మొక్కలను పంపిణీ చేసింది. కొంత మంది అధికారుల నిర్లక్ష్యం వల్ల మొక్కలు ప్రజలు, రైతులకు అందకుండా మూలన చేరాయి. కార్యాలయాలకు వచ్చే వారు మూలన పడిన మొక్కలను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆశయాలను నీరుగార్చకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం


వెల్దుర్తిలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆదివారం కర్నూలు శాంతిరామ్ లేజర్ కంటి వైద్యశాల సిబ్బంది నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, సర్పంచ్ ముత్యాల శైలజ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 103 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్ల జోళ్లు పంపిణీ చేసి, అత్యవసరమైన వారిని శస్త్రచికిత్సకు సిఫార్సు చేసినట్లు డాక్టర్ సాయి తెలిపారు. సిబ్బంది నాగలింగడు, మధు, చంద్ర, రియాజ్ పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న మాళ మల్లేశ్వర స్వామి

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం శ్రావణమాసం మూడవ వారంలో భాగంగా మాళ మల్లేశ్వరస్వామి పూజలో భాగంగా మూల విరాట్‌లకు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, భండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, అర్చనలతో పాటు ఇతర ప్రత్యేక పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మాళ మల్లేశ్వరుడిని దర్శించుకోవడానికి ఆంధ్ర–కర్ణాటక నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా కుంభోత్సవం


కుంభం ఊరేగింపులో పాల్గొన్న మహిళలు


పూజలందుకుంటున్న భీర లింగేశ్వర స్వామి

హొళగుంద: శ్రావణమాసం మూడవ ఆదివారం సందర్భంగా మండల కేంద్రంలో భీర లింగేశ్వర స్వామి కుంభోత్సవం కురువ కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. గ్రామంలోని పెద్దబావి వద్ద గంగి పూజ అనంతరం భక్తులు కుంభాన్ని వీధుల్లో ఊరేగింపుగా స్థానిక ఈర్లకట్ట వద్ద వెలసిన భీరలింగేశ్వర స్వామి ఆలయ వద్దకు తీసుకొచ్చారు. ఆలయంలో ఆకుపూజ, మహామంగళారతి, నైవేద్య సమర్పణ ఇతర ప్రత్యేక పూజలు జరిగాయి. నిర్వాహకులు, కురువ కులపెద్దలు భక్తులకు అన్నదానం చేశారు.

ఈ-కేవైసీ పూర్తి చేయండి

మద్దికెర: ఈ–క్రాప్‌నకు సంబంధించి ఈనెల 10వ తేదీలోగా ఈ–కేవైసీ పూర్తి చేయాలని ఏఓ రవి ఆదివారం ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను తెలియజేసి పొలాలలోనేరైతులు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. స్థానిక ఆర్బీకేలో సహాయ వ్యవసాధికారులకు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్ పత్రాలు అందించాలన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

నందవరం: మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా జరిగాయి. ఆదివారం గ్రామంలో నవగ్రహాలు, నందీశ్వరుడు, బొడ్రాయి, దత్తత్రేయ పీఠం బాల రంగ గురిడి స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు పురోహితులు లోకనాథ్ స్వామి, వీరభద్ర, గురుమూర్తి, రంగప్ప స్వాముల ఆధ్వర్యంలో శిష్య బృందం వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి విగ్రహాలకు జల, ధాన్య, దీక్షహోమాలు, కూష్మాండ బలిదానం వంటి పూజలు నిర్వహించారు. గ్రామంలో ఆదివారం ఉదయం నవగ్రహాలు, నాభి లింగ(బొడ్రాయి), నందీశ్వరుడి విగ్రహాలను ప్రతిష్ఠించి పురోహితులు విశేష పూజలు చేపట్టారు. అనంతరం స్వామి వార్లకు భక్తులు, గ్రామస్తులు పిండి వంటలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.


జొహరాపురంలో బొడ్రాయి ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గట్టు పవిత్రతను కాపాడుకుందాం


ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టులో కొలువుదీరిన శ్రీ మాళమల్లేశ్వర స్వామి ఆలయ పవిత్రత, ఆచార సాంప్రదాయాలు, కట్టుబాట్లును అందరూ పరిరక్షించాలని దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. వచ్చే నెల 15 నుంచి 28వ తేదీ వరకు ఆలయంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే నెల 24వ తేదీన విజయదశమి పండుగ నాటికి విద్యుత్ ఆదునికీకరణ, తాగునీటి ఏర్పాట్లు, రోడ్డు మరమ్మతులు పనులు పూర్తి చేసేందుకు ఆలయ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల పెద్దలు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

బదిలీ సీఐకు ఆత్మీయ వీడ్కోలు

వెల్దుర్తి: ఇటీవల బదిలీ అయిన సీఐ పి.యుగంధర్‌కు సర్కిల్ పరిధిలోని పోలీసులు ఆదివారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హాజరై సీఐ సేవలను కొనియాడారు. పత్తికొండ టౌన్, రూరల్ సీఐలు మురళి, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, వెల్దుర్తి, కృష్ణగిరి ఎస్ఐలు చంద్రశేఖర్ రెడ్డి, సురేశ్, ఇరు మండలాల సిబ్బంది సీఐ యుగంధర్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందించి వీడ్కోలు తెలిపారు.


సీఐ యుగంధర్ వీడ్కోలు సభలో మాట్లాడుతున్న పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

వేలం ద్వారా రూ.5.16 లక్షల ఆదాయం

హొళగుంద: రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టు దసరా బన్ని ఉత్సవాల్లో భక్తులకు టెంకాయలను విక్రయించేందుకు గాను ఆదివారం దేవరగట్టులో నిర్వహించిన వేలం పాటలో నెరణికి గ్రామానికి చెందిన వీరనాగప్ప అనే వ్యక్తి రూ.5.16 లక్షలకు హక్కులను దక్కించుకున్నాడు. ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ వేలం పాటలు జరిగాయి. అక్టోబర్‌లో ప్రారంభమయ్యే దసరా ఉత్సవల సందర్భంగా టెంకాయలు అమ్ముకునేందుకు నిర్వహించిన వేలం పాటలో తీవ్ర పోటీ నెలకొంది. హెచ్చు పాడిన వీరనాగప్ప ఉత్సవాలు ముగిసే లోపు పాడిన మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని ఆలయ నిర్వహకులు తెలిపారు. వేలంలో గతేడాది కంటే రూ.14 వేలు ఆదాయం పెరిగింది. ఆలయ నిర్వహకులు నెరణికి, నెరణికి తాండ, కొత్తపేట గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా శివాలయ నిర్మాణం

తుగ్గలి: ఉప్పర్లపల్లి సమీపంలోని బోడబండ పుణ్యక్షేత్రంలో శివాలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దాదాపు 300 ఏళ్ల క్రితం వెలసిన పురాతన శివాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో దాతలు, భక్తుల సహకారంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మిస్తున్నారు. ఆలయ నిర్మాణానికి ఇప్పటికే దాదాపు రూ.40 లక్షలు ఖర్చు చేశారు. గోపుర నిర్మాణం, ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలకు మరో రూ.20 లక్షలు అవసరమవుతాయని ఆలయ ధర్మకర్త సుదర్శనరెడ్డి, నిర్వాహకులు కృష్ణయ్యఆచారి తెలిపారు.


బోడబండ పుణ్యక్షేత్రంలో నిర్మిస్తున్న శివాలయం

నేడు ఉప సర్పంచ్ ఎన్నిక లాంఛనం

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎల్ నగరం గ్రామ ఉప సర్పంచ్ ఎన్నిక సోమవారం జరుగనున్నట్లు ఎన్నికల అధికారి/ఎంపీడీఓ శ్రీనివాస రావ్ తెలిపారు. సర్పంచ్ మహేశ్వరి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగనున్న ఎన్నికలో 12 మంది వార్డు మెంబర్లు పాల్గొననున్నారు. సర్పంచ్‌తో సహా మొత్తంగా అందరు వార్డు మెంబర్లు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే కావడంతో ఎన్నిక లాంఛనం కానుంది. ఉప సర్పంచ్‌గా వార్డు మెంబరు షేక్ మహబూబ్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నాయి.

రాజగోపుర నిర్మాణానికి విరాళం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి ఆదివారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి భక్తిని చాటుకున్నారు. ఆదోని వాస్తవ్యులు కె.అయ్యన్న ఆచారి కుటుంబ సభ్యులు రూ.లక్ష, ఎస్.కృష్ణరావు కుటుంబ సభ్యులు రూ.లక్ష, అలాగే నిత్యాన్నదాన కార్యక్రమానికి కర్నూలుకు చెందిన పద్మావతి, వెంకటరామిరెడ్డి కుటుంబసభ్యులు రూ.50,116లను ఆలయ కార్యాలయంలో అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ చెప్పారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, శేష వస్త్రాలు, లడ్డూలు, బాండు, స్వామివారి ఫొటోను అందజేశారు.

నిరుద్యోగులను పట్టించుకోని కేంద్రం

ఎమ్మిగనూరుటౌన్: అధికారంలోకి వచ్చిన తర్వాత 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని సీపీఎం నాయకుడు గోవిందు, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్య పరిష్కారంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 9.82 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, రైల్వేలో 2,61,234 పోస్టులు, భద్రత విభాగంలో 53,178, ఆర్మీలో 4 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఎయిరిండియా, ఓడరేవులు, ఆయిల్ కార్పొరేషన్, ఎన్ఎండీసీ, ఉక్కు తదితర పరిశ్రమలు ప్రైవేటీకరించిన తరువాత ఆయా సంస్థల్లో ఉద్యోగాల కల్పన శూన్యమైందని ఆరోపించారు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని కోరారు. ఆయా సంఘాల నాయకులు రాముడు, రవి, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలతో ఒరిగేదేమీ లేదు

ఆస్పరి: కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల పేరిట కొత్త నాటకం తెరపైకి తెచ్చిందని, ఆ విధానం వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గుడిసి మహానంది అన్నారు. ఆదివారం జొహరాపురం గ్రామంలో మాల మహానాడు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళితులకు చేసిందేమీ లేదన్నారు. దళితులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు జరగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో జరిగిన మత ఘర్షణల్లో 200 మంది మరణిస్తే కేంద్ర ప్రభుత్వం అక్కడ ఎలాంటి విచారణ కమిటీ ఏర్పాటు చేయలేదన్నారు. బీజేపీ ఎన్నికల జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మాల మహానాడు నాయకులు సంజీవ్, నాగార్జున, జనార్దన, అనిల్, వీరకుమార్, గోవింద్, నరేష్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలి

కృష్ణగిరి: గృహ, వ్యవసాయ రంగంలో విద్యుత్ వాడకం పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని మండల ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి సూచించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన వివిధ గ్రామాల రైతులతో మాట్లాడారు. మండలంలో ఏడాదికేడాది వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెరుగుతున్నాయని, రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం విద్యుత్ వాడకం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. పంపుసెట్ల వద్ద ఏదైనా సమస్య ఏర్పడితే సంబంధిత అధికారులకు తెలియజేసి సరిచేసుకోవాలని సూచించారు. అధికారులు అందుబాటులో లేకపోతే విద్యుత్ సరఫరాకు సంబంధించి ఎల్సీ తీసుకున్న తర్వాతే పని చేసుకోవాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. వర్షాలు పడుతున్న సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

కృష్ణగిరి: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ సురేష్ సూచించారు. కృష్ణగిరి నుంచి వెల్దుర్తికి వెళ్లే రహదారిలో ఆదివారం సాయంత్రం ఆయన వాహనాల తనిఖీ, డ్రంకన్ డ్రైవ్ చేపట్టారు. లైసెన్స్‌లు, హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రయాణంలో ఏలాంటి నిర్లక్ష్యం వహించినా ప్రాణాలకే ప్రమాదమన్న విషయాన్ని ప్రతిఒక్కరు గుర్తించుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. లైసెన్స్, హెల్మెట్, ఇతరత్ర పత్రాలు లేని వారిపై కేసులు నమోదు చేసి ఈ–చలనా ద్వారా జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

పైర్లకు ఊపిరిపోసిన వర్షం


వెల్దుర్తి వద్ద వంకలో పారుతున్న నీరు


రామళ్లకోట వీధిలో పారుతున్న వర్షపు నీటిలో చిన్నారుల సందడి

వెల్దుర్తి: గత 45 రోజులుగా మొహం చాటేసిన వరుణుడు ఒక్కసారిగా కుండపోతతో ఊపిరినిచ్చాడు. మండల వ్యాప్తంగా శనివారం రాత్రి 10 గంటల నుంచే చినుకులతో ప్రారంభమై ఆదివారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. దీంతో మండలంలోని వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు, కుంటలు నిండి పారాయి. రామళ్లకోట గ్రామం బోయవీధి గుండా పారిన వరద నీరు వంకను తలపించింది. ఆదివారం ఉదయం 7 గంటలకు మండలవ్యాప్తంగా సరాసరి వర్షపాతం 84 మి.మీలు నమోదైనట్లు ఏఎస్ఓ అభిమన్యు తెలిపారు. వెల్దుర్తి, గోవర్ధనగిరి, రామళ్లకోట ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. గోవర్ధనగిరి విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌లో ఆదివారం ఉదయం 5 గంటలకు 72.5 మి.మీలు నమోదైంది. మిగతా ప్రాంతాల్లో మోస్తరుగా కురిసి పొలాలు పదునయ్యాయి. ఇప్పటికే వర్షాభావంతో ఖరీఫ్ పంటల్లో ప్రధానమైన వేరుశనగ పూర్తిగా దెబ్బతింది. 40 శాతం ఎర్ర నేలల్లోని ఆముదాలు, పత్తి సైతం దిగుబడిరాని స్థితికి చేరుకున్నాయి. మిగిలిన కంది, పత్తి, ఆముదాలకు ఆదివారం నాటి వర్షం మేలు చేసిందని ఏఓ అక్బర్‌బాష తెలిపారు. బోరు బావుల్లో నీరు ఇంకిపోయి ఇబ్బంది పడుతున్న రైతులకు ఈ వర్షం వల్ల ఊరట కలిగింది. భూగర్భ జలాలు పెరిగే అవకాశం కలిగింది. అలాగే రబీ సాగుకు ఈ వర్షం అనుకూలమన్నారు. వర్షాభావంతో ఇప్పటికే పంటలు దున్నేసిన పొలాలు, బీడు పొలాలు సైతం ఆదివారం నాటి వర్షంతో పదును కావడంతో ప్రొద్దుతిరుగుడు, జొన్న, వాము, ఇతరత్రా సాగుకు రైతులు సిద్ధమౌతున్నారు. ఆదివారం రాత్రి వర్షానికి రామళ్లకోట గ్రామ తేరుబజారులోని తారకేశ్వర్‌కు చెందిన మట్టిమిద్దె కూలి రూ.30 వేలు నష్టం కలిగింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అలాగే పిక్కిలివాని పల్లె, పలు ప్రాంతాలలో పత్తి, కంది పైర్లు నీట మునిగాయి.


రామళ్లకోటలో కూలిన మట్టిమిద్దె


పిక్కిలివాని పల్లెలో పత్తి చేనులో చేరిన వర్షపు నీరు

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేత

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామానికి చెందిన జైనాబీ అనే వృద్ధురాలు ఆరోగ్యం బాగలేక హైదరాబాద్‌లో కుమారుడి వద్ద ఉంటున్నారు. ఆమె పరిస్థితి తెలుసుకున్న వలంటీర్ ఖాదర్ ఆదివారం హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేశారు. వ్యయ ప్రయాసల కోర్చి పొరుగు రాష్ట్రానికి వచ్చి పింఛన్ అందించడంపై లబ్ధిదారురాలు హర్షం వ్యక్తం చేసింది.



జైనాబీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఖాదర్

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ

నందవరం: మండలంలోని అన్ని గ్రామ సచివాలయ పరిధిలో మూడవ రోజు ఆదివారం వలంటీర్లు లబ్ధిదారులకు ముమ్మరంగా పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఉదయాన్నే ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు అందజేయడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచే పింఛన్ల పండుగ మొదలవుతుందని, 5వ తేదీ వరకు కొనసాగుతుందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో 7,103 పింఛన్లు ఉన్నాయని 192 మందికి ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేసిందని ఎంపీడీఓ దశరథ రామయ్య చెప్పారు. ఇప్పటి వరకు 95.23 శాతం మందికి పింఛన్లు పింపిణీ చేసినట్లు వెల్లడించారు.

వైభవంగా ఊరేగింపు

మద్దికెర: మండల కేంద్రంలో శ్రావణమాసం సందర్భంగా కురువ సామాజిక వర్గం ఆధ్వర్యంలో వశికేరప్ప, ఎలిగురిగప్ప, భీరప్ప స్వాముల ఊరేగింపు కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. బోనాలతో ప్రధాన బస్టాండు వద్ద ఉన్న ఈశ్వరుడి ఆలయం నుంచి పూలతో ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వార్లను మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు.


స్వామివార్ల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి

పగిడి: మద్యం మత్తులో కిందపడి కర్నూలు జిల్లాకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కూలి పనులతో జీవనం సాగిస్తున్న కర్నూలు జిల్లా నందవరం గ్రామానికి చెందిన వెంకటేష్ (53), రెండు నెలలుగా పరిగి మండలం హిందూపురం–మధుగిరి ప్రధాన రహదారిపై వంతెన విస్తరణ పనులకు హాజరువతున్నాడు. మద్యం అలవాటు ఉన్న ఆయన శనివారం రాత్రి అతిగా మద్యం సేవించి పెద్దిరెడ్డిపల్లి వద్ద ఏర్పాటు చేసుకున్న షెడ్డు వద్ద కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విచారణలో మృతుడిని వెంకటేష్‌గా నిర్ధారించుకుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పరిగి ఎస్ఐ నరేంద్ర తెలిపారు.


మృతుడు వెంకటేష్